ప్రజాశక్తి
బుధవారం 19 జులై 2023
5

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-పెదబయలు : మండలంలోని గంపరాయి పంచాయతీ కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుపై స్థానిక రైతులకు ఎపిసిఎస్ఎఫ్ ఎపిఎఫ్ సిబ్బందికి మండల ఇన్‌ఛార్జి జి శాంతి కుమారి అవగాహన కల్పించారు వంతల సుహాషిణి అనే మహిళా రైతు వరినారుమడిలో నారు శుద్ధికి బీజామృతం తయారీ, వినియోగంపై వివరించారు. పంటపొలాల్లో చీడపీడల నివారణకు ద్రవజీవామృతం వినియోగంపై వివరించారు. కార్యక్రమంలో గంపరాయి ఇన్‌చార్జి ఎం విజయ, మత్స్యరాజు,కో ఆర్డినేటర్ ఎ.కనకమహాలక్ష్మి, దినేష్ పాల్గొన్నారు

రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి

# సాగు భూముల జోలికొస్తే తరిమి కొడతాం

## భూపోరాట కమిటీ సమావేశంలో సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

సాగు రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని అనంతగిరి, ఎగువశోభ, టోకూరు, కొండిబ పంచాయతీల పరిధిలో అరకు రోడ్డును ఆనుకొని ఏళ్ల తరబడి గిరిజనుల సాగులో ఉన్న భూముల జోలికొస్తే తరిమి కొడతామని జెడ్‌పిటిసి, సిపిఎం నేత దీసరి గంగరాజు హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో సంఘం ఆధ్వర్యన భూపోరాట కమిటీ ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, . నాలుగు పంచాయతీలు, ఎనిమిది రెవెన్యూ గ్రామాల పరిధిలో 200 మంది గిరిజన రైతులు 300 ఎకరాల భూమిని పూర్వీకుల నుంచి గిరిజనుల సాగులో ఉన్న భూములను ఇపుడు విజయనగరం మహారాజులకు చెందిన కొంతమంది వ్యక్తులు వచ్చి తమ భూములు అంటున్నారని, వీటిని లాక్కోనేందుకు యత్నిస్తూ చూస్తూ ఊరుకోబోమన్నారు. దీనిపై ఐటిడిఎ పాలకమండలి సమావేశం లోనూ, ఉమ్మడి జిల్లా పరిషత్ సమావేశాల్లో లేవనెత్తి, గిరిజనులకు సాగుహక్కు పట్టాలు ఇప్పించేందుకు కృషిచేస్తానన్నారు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ సాగు భూములకు పట్టాలు అందే వరకు రైతులందరూ ఏకతాటిపైకి వచ్చి ఐక్యంగా పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 21న శుక్రవారం పాడేరు గ్రీవెన్స్‌కు వెళ్లి లిఖితపూర్వకంగా కలెక్టర్, ఐటిడిఎ పిఒలకు విన్నవించాలని కోరారు. కార్యక్రమంలో టోకూరు సిపిఎం సర్పంచ్ కిల్లో.మొస్య. సిపిఎం మండల కార్యదర్శి ఎస్ .నాగులు, సంఘం మండల అధ్యక్షులు ఎస్.కొండలరావు, రైతులు ఎస్ ఆనందరావు, పి. కొండలరావు, ఎస్. రామన్న పాల్గొన్నారు

### భూ పోరాట కమిటీ ఎన్నిక..

సాగుభూములపై హక్కులు సాధించుకునే వరకు పోరాటాన్ని కొనసాగించాలని నిర్ణయించిన రైతన్నలు, సిపిఎం ఆధ్వర్యంలో భూపోరాట కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షునిగా గెమ్మెల రమేష్, కార్యదర్శిగా ఎస్. సుబ్బారావు, కో కన్వీనర్‌గా ఎస్.నాగులుతో కూడిన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

భూ పోరాట కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు

# జోరు వానలోనూ ఆశాల ఆందోళన

## సమస్యలను పరిష్కరించాలని డిమాండ్

చింతూరులో వర్షంలోనూ ఆందోళన చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - రంపచోడవరం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రంపచోడవరం జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం ఎదుట ఆశా కార్యకర్తలు జోరువానలోనూ ఆందోళన చేపట్టారు. ఆశాలు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెద్ద పెట్టు చేసిన నివాదాలతో ఆ ప్రాంతం మారుమోగింది. అనంతరం ఎడిఎంహెచ్ఒ డాక్టర్.భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అఖిలభారత నాయకులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ 8 గంటల పని విధానం అమలు చేయకుండా, కనీస వేతనం ఇవ్వకుండా ఆశా వర్కర్లతో ప్రభుత్వం గొడ్డు చాకరీ చేయిస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఆశావర్కర్లపై పని భారం పెరిగిందని, అధికార పార్టీ నాయకుల వేధింపులు రోజు రోజుకు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

**చింతూరు** : వర్షాన్ని సైతం లెక్కచేయకుండా చింతూరు డివిజన్లోని ఆశా కార్మికులు చింతూరు డిప్యూటీ డిఎంహెచ్ఓ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఆశా వర్కర్లపై పని భారాన్ని తగ్గించాలని, నాణ్యమైన సెల్ ఫోన్లు, 4జి సిమ్‌లు ఇవ్వాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవులు వర్తింపజేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని నినాదాలు చేశారు. నాలుగు గంటల పాటు డిడిఎంహెచ్ఓ కార్యాలయం లోపల ఆశా కార్మికులు బైఠాయించారు. అయినా డిప్యూటీ డిఎంహెచ్ఓ, ఇతర అధికారులు రాకపోవడంతో రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమం దగ్గరికి వచ్చిన సబ్ ఇన్‌స్పెక్టర్ విషయం ఐటిడిఎ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఐటీడీఏ ఏవో రాస్తారోకో వద్దకు వచ్చి డిప్యూటీ డిఎంహెచ్ఓతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, జిల్లా ఉపాధ్యక్షులు పూనెం సత్యనారాయణ, కొమరం పెంటయ్య మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఆశాల శ్రమదోపిడీ చేస్తుందని, 14 యాపులు, 26 రిజిస్టర్లు ఆశా కార్మికుల నిర్వహించాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఆశా కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు లక్ష్మణ్, దిలీప్, ఆశ యూనియన్ నాయకులు దారేశ్వరి, ముత్తమ్మ, శ్రీదేవి, సుజాత, నూతన, శారద, జయ, కళ్యాణి, ముత్యాల అక్క, ఉష, దుర్గ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ డిఎంహెచ్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న ఆశాలు

రంపచోడవరంలో గొడుగులు వేసుకొని ధర్నా కొనసాగిస్తున్న ఆశా కార్యకర్తలు, అనంతరం ఎడిఎంహెచ్ఒ భాస్కర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

# వీడకుండా కురుస్తున్న వర్షంతో ఇక్కట్లు

హుకుంపేటలో బురదమయమైన రోడ్డు

ప్రజాశక్తి డుంబ్రిగుడ: మండలంలో మూడు రోజుల నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తుండడంతో గిరిజనులు పలు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా జోరుగా ఏకధాటిగా వర్షం కురుస్తుండడంతో మండల కేంద్రంలోని వీధి కాలువలు, రోడ్లన్నీ పూర్తిగా జలమయంగా మారాయి. పంట పొలాలన్నీ నీటితో కళకళ లాడుతున్నాయి. పెదగేడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు వద్ద వర్షపు నీరు నిల్వ ఉండడంతో వాహనదారులు రాకపోకలకు పలు ఇబ్బందులు పడ్డారు.

**హుకుంపేట:** ఏజెన్సీ వ్యాప్తంగా జోరుగా కురుస్తున్న వానతో ఇక్కట్లు పడుతున్న రైతులు,విద్యార్థులు, ఉపాధ్యాయులు, వ్యవసాయం చేసేందుకు పనులకు వెళ్తున్న రైతులు జోరు వర్షాలతో ఇబ్బంది పడుతున్నారు. వ్యవసాయ పనుల్లో ఉన్న రైతులు, కూలీలకు వీడకుండా కురుస్తున్న వర్షంతో ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్లన్నీ బురదమయంగా కాగా, గోతుల్లో నీరు నిండి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

### జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షాలు

ప్రజాశక్తి -పాడేరు : అల్లూరి జిల్లాలో గత మూడు రోజులుగా ఒక మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. పలు మండలాల్లో చినుకులతో కూడిన జల్లులు పడుతుండగా మరికొన్ని మండలాల్లో సాధారణ వర్షాలు కురుస్తున్నాయి. గత ఆదివారం నుంచి ఏజెన్సీ అంతటా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం వర్ష ప్రభావం ఎక్కువయింది. అల్లూరి జిల్లా మొత్తం మీద ఈ నెల 16న 132.7 మిల్లీమీటర్లు, 17న 183.4 మిల్లీమీటర్లు, 18న మంగళవారం 345.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. పాడేరు ఏజెన్సీలో గాలి వర్షంతో గాడిన జల్లులు ఏకధాటిగా పడుతున్నాయి. దీంతో జన జీవనానికి అంతరాయం ఏర్పడింది. పెదబయలు ముంచంగి పుట్టు డుంబ్రిగుడ ప్రాంతాల్లో, రంపచోడవరం డివిజన్లో కూనవరం చింతూరు, వర రామచంద్ర పురం, ఎటపాక, మారేడుమిల్లి వై రామవరం తదితర మండలాల్లోని వర్ష ప్రభావం ఎక్కువగా ఉంది. మన్యవ్యాప్తంగా వర్షాలు పడుతున్న తరుణంలో ఖరీఫ్ వ్యవసాయ పనులు ఊపందుకొనున్నాయి.

# కోయ భాషా దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-చింతూరు

కోయ భాషా దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. 8వ షెడ్యూల్ ప్రకారం కోయ (గోండి) భాషలను జాతీయ భాషగా గుర్తించాలన్నారు. జూలై 21న కోయ భాషా దినోత్సవం సందర్భంగా మండలంలో చిడుమూరు పంచాయితీ చిడుమూరు స్కూల్‌లో మంగళవారం పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకుడు కుంజా బాలు మాట్లాడుతూ పిల్లలకు కోయ భాషలోని పద్యాలు, సామెతలు, కథలు వలన మానసిక శక్తి, నైతిక విలువులు పెరుగుతాయని తెలిపారు. జూలై 23న కోయ బాల సాహిత్య కార్యక్రమం కోయతోర్ బాట, గోటుల్ ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్ మునిగే ఏజెన్సీ ప్రాంతాలలో ప్రత్యేకమైన పీజీ కళాశాలను చింతూరు, ఏలూరు డివిజన్లలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గడిగి ముత్తయ్య, సవలం లక్ష్మణ్, బొక్కిలి నారాయణ, సోడి రాజు, పీసం దూలయ్య పాల్గొన్నారు.

# కార్మికులందరికీ 'ఈ-శ్రమ్' కార్డు తప్పనిసరి

## కార్మికశాఖ సహాయ అధికారి సూర్యనారాయణ

కార్డు అందజేస్తున్న కార్మికశాఖ అధికారి సూర్యనారాయణ

ప్రజాశక్తి- పాడేరు జిల్లాలో వివిధ రంగాలలో స్వయంఉపాధి పొందుతున్న అసంఘటిత రంగ కార్మికులందరూ ఈ శ్రమ్ కార్డు తప్పనిసరిగా పొందాలని జిల్లా సహాయ కార్మికశాఖ అధికారి పి సూర్యనారాయణ సూచించారు. జిల్లాలో అసంఘటిత రంగ కార్మికులను గుర్తించి వారికి ఈ శ్రమ్ కార్డులు అందజేస్తున్నామన్నారు. మంగళవారం పాడేరులో పలువురికి ఈ శ్రమ్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అల్లూరి జిల్లాలోని పాడేరు, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు, అరకు జి.మాడుగుల, అనంతగిరి, మండలాలలోని అసంఘటిత కార్మికులందరూ సామాజిక భద్రత కల్పించే దిశగా 'ఈ శ్రమ్' పోర్టల్‌లో 18 - 59 ఏళ్ల వయస్సు వారంతా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ శ్రమ్' కార్డున్న కార్మికుడు ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యం పొందినా రూ.2 లక్షలు బీమా పరిహారం వస్తుందని, అదేపాక్షిక వైకల్యానికి రూ.1 లక్ష పరిహారాన్ని కేంద్ర ప్రభుత్వం చెలిస్తుందన్నారు. ఆయన తెలిపారు. ఈ శ్రమ్ కార్డు కోసం సమీపంలోని సిఎస్.సి సెంటర్, మీ సేవ కేంద్రాలు, గ్రామ సచివాలయంలో ఆధార్ కార్డ్, బ్యాంకు పాస్ బుక్, ఆధార్ లింక్ కలిగిన సెల్ ఫోన్‌తో వెళ్లి నమోదు చేయించుకోవాలని సూచించారు. పూర్తి వివరాలను పి. సూర్యనారాయణ సహాయ కార్మికాదికారి 9492555018 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

# మద్రేబులో వైద్యశిబిరం

## 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

రోగులను పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని పిన్నకోట ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలోని మద్రేబు గ్రామంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో జ్వరాలు ప్రబలి, పలువురు గిరిజనులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో 'మంచం పట్టిన మద్రేబు' శీర్షికతో మంగళవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పిన్నకోట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వైద్య బందం గ్రామానికి చేరుకుని జ్వరాలతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సేవలు, మందులు ఇచ్చారు. ప్రైవేట్ ఆస్పత్రిలలో వైద్య సేవలు పొందుతున్న వారి వివరలను సేకరించారు. దగ్గు, జలుబు జ్వరం వస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని వైద్యసిబ్బంది సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి వడబోసిన నీరు,వేడి ఆహారం భుజించాలని, నిల్వ ఉంచిన ఆహారపదార్థాలను తీసుకోరాదని, పలు ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌వి. సావిత్రి. హెల్త్‌అసిస్టెంట్ రామరాజు, రాంబాబుపాల్గొన్నారు

# త్వరితగతిన ప్రాధాన్యతా భవన నిర్మాణాలు

## జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు: ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాడేరు డివిజన్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో రైతుభరోసా కేంద్రాలు, సచివాలయాల భవన నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఇదే అంశంపై రంపచోడవరం, చింతూరు డివిజన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. మండలాల వారీగా రైతుభరోసా కేంద్రాలు, సచివాలయ భవన నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా భవన నిర్మాణాలకు రూ. 2.30కోట్ల నగదును ప్రభుత్వం విడుదల చేసిందని, ఎక్కడా పెండింగ్ లేకుండా, పూర్తిచేసిన పనులకు సంబంధిత కాంట్రాక్టర్లకు వెంటనే బిల్లులు చెల్లించాలని ఆదేశించారు.. తుది దశకు చేరిన భవనాలను వచ్చే నెలాఖరు నాటికి పూర్తిచేసి అప్పగించాలని సూచించారు. కాంట్రాక్టర్లకు ఫైనల్ బిల్లు చెల్లింపు, ఇతరత్రా ప్రక్రియలన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. పాడేరు మండలం దేవాపురం రైతు భరోసా కేంద్రం పనులు జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేసారు. రెండు మించి భవనాల నిర్మాణానికి కాంట్రాక్టు పొంది, అడ్వాన్సులు తీసుకుని పనులు చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భవన నిర్మాణాలకు రెండు వందల సిమెంటు బస్తాలు వరకు బయట కొనుగోలు చేయడానికి అనుమతించారు. సమావేశంలో పాడేరు ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, రంపచోడవరం పిఒ సూరజ్ గనోరే, పంచాయతీరాజ్ ఇఇ కె.లావణ్యకుమార్, టి.కొండయ్య పడాల్, ఇతర ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్ మస్తాన్ వల్లి

## మిషన్ ఇంద్రధనస్సుపై అవగాహన

ప్రజాశక్తి -సీలేరు

జీకే మండలం సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, అంగన్వాడీ, ఆశా వర్కర్లకు మిషన్ ఇంద్రధనస్సు ట్రైనింగ్ ప్రోగ్రామ్‌పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు ఖాదర్ మస్తాన్ వల్లి, సౌమ్య మాట్లాడుతూ ఆశా, అంగన్వాడీ వర్కర్లు ఇంటింటికి వెళ్లి గర్భిణులు, 10 సంవత్సరాలు లోపు పిల్లలకు టీకాలు వేయించుకున్నారా లేదా తెలుసుకోవాలని సూచించారు. ఒకవేళ టీకాలు వేసుకొని వారు ఉంటే నమోదు చేయాలన్నారు. టీకా వేసే కార్యక్రమాన్ని ఆగస్టు 7 నుంచి 12 వరకు, సెప్టెంబరు 11 నుంచి 16 వరకు ఆసుపత్రిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీటిపై ప్రజలకి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ త్రినాథ్, అంగన్వాడీ సూపర్వైజర్ మోహిని పాల్గొన్నారు.

## చీరల పంపిణీ

ప్రజాశక్తి-కొయ్యూరు

మాజీ ఎమ్మెల్యే ఎంవీవీవీ.సత్యనారాయణ 16వ వర్ధంతి సందర్భంగా మంగళవారం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సత్యనారాయణ కుమారుడు, టిడిపి ఎస్టీ సెల్ నాయకులు తన కుటుంబ సభ్యులతో కలిసి కొయ్యూరులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రేవళ్ల సర్పంచ్ వెంకటలక్ష్మి, రాజేంద్రపాలెం సర్పంచ్ సింహాచలం, కొయ్యూరు సర్పంచ్ బాలరాజు, రావణాపల్లి సర్పంచ్ లక్ష్మీ, మట్టపర్తి అప్పలరాజు, మేడిపోయిన చిన్న చెన్నారెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

# క్రమంగా పెరుగుతున్న శబరి, గోదావరి

## భయాందోళన చెందుతున్న నిర్వాసితులు

ప్రజాశక్తి- విఆర్.పురం

ఎగువన నాలుగు రాష్ట్రాల్లో నాలుగైదు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో శబరి గోదావరి సంగ్రామంలో క్రమంగా నీటి మట్టం పెరుగుతోంది. దీంతో పోలవరం ముంపు ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. గతేడాది ఇదే కాలంలో కురిసిన భారీ వర్షాల వల్ల వారు పడిన ఇబ్బందులు, నెలల తరబడి ఇళ్లను వదిలి గుట్టలపై తలదాచుకున్న వైనాన్ని గుర్తు చేసుకొని భయకంపితులవుతున్నారు. తాగేందుకు నీరు లేక, రెండు పూటలా అన్నం లేక, బిక్కుబిక్కుమంటూ చెట్టు కొకరు, పుట్టకొకరు ఉన్న పరిస్థితిని తలుచుకొని భయపడుతున్నారు. గతేడాది వరదులు తగ్గిన తరువాత ఇళ్లు శుభ్రం చేసుకోవడానికి ఒక్కొక్కరు రూ.50వేలకు పైగా చేసిన ఖర్చులను తలుచుకుంటున్న నిర్వాసితుల గుండెలు గుబేలు మంటున్నాయి. గతేడాది లాగా కాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకొని తమకు సరైన పునరావాసం కల్పించాలని కోరుతున్నారు.

# గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం'



మహిళలకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలం బకులూరు గ్రామ సచివాలయం బాలారం పంచాయతీ పరిధిలోని మల్లవరం, పాత బలరాం, కొత్త బలరాం గ్రామాలలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి చేపట్టారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా 380 గడపలను సందర్శించారు. నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సహకారాన్ని గణాంకాలతో సహ భాగ్యలక్ష్మి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ, వైసిపి నాయకులు జల్లి బాబులు, నాగమణి, అచ్యుత్, బండి సుధాకర్, రేగటి ముసలి నాయుడు, ధోని బాబ్జి, గాడి సత్యనారాయణ, వనం బాబు, శేఖర్, రామరాజు, కూడా రాజు, అప్పన్న, గజ్జయదొర, స్థానిక నాయకులు బుజ్జి, వెంకన్న తాత, గోవింద్, నాగియమ్మ, గోపి, రవికుమార్, నూకరత్నం పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న రాధాకృష్ణ తదితరులు

## బంట్రోతుపుట్టు తారురోడ్డును బాగుచేయరూ!

ప్రజాశక్తి పాడేరు : మండలంలోని మారుమూల ప్రాంతమైన బంట్రోతుపుట్టుకు తారురోడ్డు నిర్మించాలనిఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం అధ్వాన్నరోడ్డుతో బంట్రోతుపుట్టు గిరిజనులు పడుతున్న కష్టాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ పాడేరు, పెదబయలు మండలాలను అనుసంధానించే పెదకోడాపల్లి , కించూరు, కుంతర్ల మూడు పంచాయతీల పరిధిలోని దాదాపు 40గ్రామాల ప్రజలు బంట్రోతుపుట్టు తారురోడ్డు బాగోలేక ప్రజలు నానాయాతన పడుతున్నారన్నారు.నిత్యావసరాలతోపాటు అత్యవసరాలకు ఇదేమార్గం శరణ్యమని, ఆటోలు,ద్విచక్రవాహనాలు, పాదచారులు, ఇతరత్రా మార్గంలో ప్రయాణించే వ్యక్తులు మామూలంగా రోడ్డు దుస్థితితో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డు నిర్మాణ సమయంలోనే తగు ముందస్తు చర్యలు చేపట్టకపోవడం వల్ల వర్షాలు కురిసిన ప్రతిసారీ రోడ్డు కొట్టుకుపోతోందని, ఫలితంగా అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. రోడ్డు దుస్థితిపై ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదన్నారు. పాడేరు, పెదబయలు మండలాలకు కనెక్టివిటీగా ఉన్న బంట్రోతుపుట్టు తారురోడ్డు తక్షణమే మరమ్మతులు చేపట్టి ప్రజల కష్టాలను తీర్చాలని కోరారు. లేకుంటే పెద్దఎత్తున గిరిజనాన్ని సమీకరించి ఆందోళన చేయవలసివస్తుందని హెచ్చరించారు.

కలెక్టరేట్ వద్ద ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న విద్యార్థులు

## సమస్యల పరిష్కారానికి విద్యార్థుల ధర్నా

ప్రజాశక్తి - పాడేరు:ప్రభుత్వ గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం పాడేరు కలెక్టర్ కార్యాలయం వద్ద ఎఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కె.రాజశేఖర్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం. లక్ష్మణ్ మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని ఎంతో మంది విద్యార్థులు ప్రీ మెట్రిక్స్, పోస్ట్‌మెట్రిక్స్ హాస్టళ్లలో ఉండి చదువుకుంటున్నారని, కానీ అక్కడ కనీస వసతులు, సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు అనుగుణంగా హాస్టల్స్‌లో మెస్ ఛార్జీలు పెంచి పూర్తిస్థాయిలో మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. తాగునీటికి ఆర్‌ఒ ప్లాంట్‌లు ఏర్పాటు చేయాలని కోరారు గిరిజన సంక్షేమశాఖఆధ్వర్యంలో హైస్కూల్, కాలేజీ విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ ఆపేశారని, విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇస్తున్న 9 పుస్తకాలు ఎటూ సరిపోవడం లేదన్నారు పూర్తిస్థాయిలో నోటు పుస్తకాలను ప్రభుత్వం అందజేయాలని, ఎస్‌సి, ఎస్‌టి, బిసి హాస్టళ్లకు భవనాలను నిర్మించాలని, రెగ్యులర్ వార్డెన్ నియమాకం, ట్యూటర్స్‌ఏర్పాటు చేయాలని కోరారు కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు జి. అనిల్, ఎం. ఆమోష్,కె. మల్లేష్, శివ పాల్గొన్నారు.

# బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి

### జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : బడిఈడు ఉన్న పిల్లలు బడిలో చేర్పించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ, గిరిజన సంక్షేమం (విద్య), ఐసిడిఎస్, గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో రెండవ విడత మన బడి నాడు నేడు, డ్రాపౌట్ విద్యార్థులు, అంగన్వాడీ భవన నిర్మాణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రంపచోడవరం, చింతూరు డివిజన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్సుల్లో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన బడి నాడు పనులకు నిధులు కొరత లేదన్నారు. గత వారం రోజుల్లో మూడు కోట్ల పైబడి నిధులు ఖర్చు చేసారని, ఇంకా రూ.2.60 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయన్నారు. మంజూరైన నిధులతో పాఠశాలలకు మౌలిక సదుపాయాలు సమకూర్చాలని ఆదేశించారు. మండలాల వారీగా బడి బయట ఎంత మంది విద్యార్థులున్నారో వివరించారు. ఎంపిడిఒలు, ఎంఇఒలు, ఉపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు బడి బయట ఉన్న విద్యార్థుల జాబితా రూపొందించి, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం ద్వారా బడిబాట పట్టించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు

**ఉపాధ్యాయులు గైర్హాజరైతే చర్యలు తప్పవు**

పాఠశాలకు ఉపాధ్యాయులు గైర్హాజరైతే జీతాలు నిలుపుదలతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఉపాధ్యాయుల హాజరుపై ఎంఇఒ, ఎటిడబ్ల్యు అధికారుల దృష్టికి తీసుకుని రావాలన్నారు. ఆశ్రమ పాఠశాలల డిప్యూటీ వార్డెన్లు రాత్రి తొమ్మిది గంటలకు వరకు ఉంటున్నారా అని ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన మెనూ అందించాలన్నారు. ఎటిడబ్ల్యుఒలు వంటగది, స్టాక్ రూం తనిఖీ చేయాలని సూచించారు. ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులు ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లతో సమావేశం నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, సూరజ్ గనోరే, డిఇఒ సలీం భాషా, గిరిజన సంక్షేమ శాఖ డిడి ఎ. కొండలరావు, ఐసిడిఎస్ పిడి సూర్యలక్ష్మి, గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్ అధికారులు, సహాయ గిరిజన సంక్షేమాధికారులు, ఎంఇఒలు, సిడిపిఒలు పాల్గొన్నారు.

**విద్యార్థులను అర్ధాకలితో ఉంచిన..**

# గోమంగి గురుకులం హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి

### ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రభుదాస్

ప్రజాశక్తి - పాడేరు: వంటగ్యాస్ లేదన్న కారణంతో విద్యార్థులకు అర్ధాకలితో ఉంచిన పెదబయలు మండలం, గోమంగి మినీ గురుకులం హెచ్ఎంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.ప్రభుదాస్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 17న సోమవారం గ్యాస్ లేదన్న కారణంతో, మధ్యాహ్నం మిగిలిన భోజనాన్ని, సాయంత్రం 210మంది విద్యార్థులకు అరకొరగా వడ్డించి, అర్ధాకలితో ఉంచడం దుర్మార్గమన్నారు. గ్యాస్ లేకపోతే కనీసం కట్టెలతో భోజనం వండి విద్యార్థులకు పెట్టాల్సిందిపోయి, ఆకలితో అలమటించేలా చేయడం దుర్మార్గమన్నారు. మధ్యాహ్నం మిగిలిన అన్నం, కూరలను సాయంత్రానికి ఏం సరిపోతాయని ప్రశ్నించారు. విద్యార్థుల తల్లిదండ్రుల సమాచారంతో అధికారులు, పత్రికల దృష్టికి తెచ్చామన్నారు.
గతేడాది కూడా గ్యాస్ లేదని చెప్పి విద్యార్థుల దగ్గర డబ్బులు వసూలు చేసి, గ్యాస్ తెప్పించి వంట చేశాకే తమకు భోజనం పెట్టారని విద్యార్థులు అంటున్నారని, ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు మెనూ ప్రకారం చికెన్, గుడ్డు, స్వీట్, సక్రమంగా పెట్టటం లేదని, దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తే ఎక్కడ ఫిర్యాదు చేసుకున్నా ఫర్వాలేదని నిర్లక్ష్యంగా చెబుతున్నారన్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణా లోపమే ఈ దుస్థితి కారణమని ఆవేదన వ్యక్తం చేశారు.
హాస్టళ్లలో సమస్యలు, విద్యార్థుల ఇబ్బందులపై గతంలో ఎస్ఎఫ్ఐ సర్వే చేసి, స్పందనలో అధికారులకు ఫిర్యాదు చేసిందని, అయినా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన వార్డెన్లు, హెచ్‌ఎంలపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. హాస్టళ్లలో మెనూ అమలు చేయకపోవడంతో అనేక మంది కడుపు నొప్పులతో, రక్తహీనతలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, హాస్టళ్ల, గురుకులాల్లో మెనూ, భోజన సౌకర్యాలపై ప్రత్యేక నిఘా పెట్టి, తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఆందోళనతోనే విఆర్‌ఎల సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-పెదబయలు : ఆందోళనతోనే విఆర్‌ఎల సమస్యలు పరిష్కారమౌతాయని విఆర్‌ఎల సంఘ మండల అధ్యక్షుడు ఎస్.సుందర్‌దేవ అన్నారు. విఆర్‌ఎల ఆందోళనకు సంబంధించి తహశీల్దార్ శెట్టి కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ, విఆర్‌ఎల రాష్ట్రసంఘం పిలుపుమేరకు ఈనెల 20,21 తేదీలలో మండలకేంద్రాల్లో రెండు రోజులు దీక్షలు చేయనున్నట్లు వెల్లడించారు. వచ్చేనెల 7,8 తేదీల్లో జిల్లా కేంద్రాల్లో, అనంతరం వచ్చేనెల 26న జగనన్నకు చెబుదాం పేరుతో చలో విజయవాడ ఆందోళన చేపడుతున్నట్లు వెల్లడించారు. విఆర్‌ఎలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## నేరాలు ఘోరాలు

### గంజాయి నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి -దుంబ్రిగుడ : పరారీలో ఉన్న గంజాయి నిందితుడు కొర్ర రంజిత్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ మంగళవారం తెలిపారు. హుకుంపేట మండలం, తీగవలస పంచాయతీ, పామురాయి గ్రామానికి చెందిన చెందిన నిందితుడు 16 కిలోలు గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు.



ఆర్థికసాయం చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

## చిరు వ్యాపారులకు 'జగనన్న తోడు'

### - జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: చిరు వ్యాపారుల ఆర్థిక స్థిరీకరణకు జగనన్న తోడు పథకం చేదోడుగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. మంగళవారం ఏడవ విడత జగనన్న తోడు ఆర్థికసాయం పంపిణీని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ప్రారంభించగా, దాని ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్‌లో కలెక్టర్, సుమిత్‌కుమార్, ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు, డిఆర్‌ఒ పి. అంబేద్కర్, డిఆర్‌డిఎ పీడీ వి.మురళి వీక్షించారు. అనంతరం జిల్లావ్యాప్తంగా 7వ విడత జగనన్న తోడుకు సంబంధించి 10,159 మంది లబ్దిదారులకు రూ.10.94 కోట్ల చెక్కును, ఆరో విడతలో రుణాలు పొంది సక్రమంగా చెల్లించిన లబ్ధిదారులకు 2396 మందికి రూ.5.27 లక్షల వడ్డీరాయితీ చెక్కును అందజేశారు.కార్యక్రమంలో వెలుగు డిపిఎం ఎస్. వైకుంఠరావు, వెలుగు సిబ్బంది, పలువురు లబ్దిదారులు పాల్గొన్నారు.

## సురక్షతో అర్హులకు సంక్షేమ లబ్ధి

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడానికి ప్రభుత్వం జగనన్న సురక్ష పథకం అమలు చేస్తోందని ఎంపిడిఒ ఉషారాణి అన్నారు. మంగళవారం మండలంలోని తూటంగి పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 11 రకాల ధ్రువపత్రాలను గిరిజనులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ అర్హులై ఉండి, సంక్షేమ లబ్ధికి నోచుకోని వారికి కొత్తగా దరఖాస్తు చేయించడం ద్వారా అందజేస్తామన్నారు. అలాగే పలు ధ్రువీకరణలను ఉచితంగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఎస్ ఆనంద్, రెవెన్యూ అధికారులు, వైసిపి నాయకులు సింహాచలం, నాగేశ్వరరావు, గ్రామ వాలంటీర్లు, గిరిజనులు పాల్గొన్నారు.

**పెదబయలు** : మండలంలోని రూడకోట పంచాయతీ కేంద్రంలో ఎంపిడిఒ ఎల్.పూర్ణయ్య తహసీల్దార్ కష్ణారావు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లింగేటి పంచాయతీ కేంద్రంలో గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు.

## లింగేటిలో గడపగడపకూ ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పెదబయలు : మండలంలో మారుమూల లింగేటి గ్రామ పంచాయతీ లింగేటిలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ పాల్గొన్నారు రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. లింగేటి గ్రామంలో ఎమ్మెల్యే శెట్టి పాల్గుణకు మహిళలు ఘన స్వాగతం పలికారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులంతా భరోసా కేంద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. తహసీల్దార్ ఆధ్వర్యంలోధ్రువపత్రాలను అందజేశారు కార్యక్రమంలో మాజీ ఎంపిపి నల్లంగి ఉమామహేష్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పద్మావతి

## పెరుగుతున్న ధరలకు అడ్డుకట్ట వేయాలి

### - ఐద్వా జిల్లా కార్యదర్శి పద్మావతి

ప్రజాశక్తి - కూనవరం : పెరుగుతున్న ధరలకు ప్రభుత్వాలు అడ్డుకట్ట వేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఎఎస్‌ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి పద్మావతి డిమాండ్ చేశారు. ఐద్వా కమిటీ సమావేశం కుంజా రాధ అధ్యక్షతన స్థానిక ఆవుల నాగమయ్య భవనంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు రోజు రోజుకి పెరిగిపోతున్నాయని, కేజీ టమాట రూ.160, కేజీ అల్లం రూ.350, మిర్చి రూ.200 ఉన్నాయని, ఇలా అయితే సామాన్య ప్రజలు ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. కూరగాయలు ధరలు బంగారం రేట్లతో పోటీ పడుతున్నాయన్నారు. అధిక ధరలు ఉంటే ఆహారంలో మొదట కొత పడేది మహిళలకేనని, సరైన ఆహారం లేక వారు రక్తహీనతకు గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నిత్యావసర వస్తువుల ధరలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అదుపు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐద్వా నాయకులు పాయం జ్యోతి, కొమరం శారద, కూర రజిని తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ దురుద్దేశం కోసమే యుసిసి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాజకీయ దురుద్దేశం కోసమే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉమ్మడి పౌర స్మృతి అంశాన్ని ముందుకు తీసుకొచ్చిందని, ఈ అంశమేమీ దేశ యోగక్షేమాలకు సంబంధించినది ఎంత మాత్రమూ కాదని భారత్ బచావో విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్ అన్నారు. భారత బచావో జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో యుసిసి, ఉమ్మడి పౌరస్మృతి అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుసిసిపై పౌర సమాజం సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భారత్ బచావో ఉత్తరాంధ్ర జోనల్ చైర్మన్ గూడూరు సీతామాలక్ష్మి మాట్లాడుతూ యుసిసి డ్రాఫ్ట్ కూడా తయారు చేయకుండా చట్టం చేస్తామని బిజెపి అనడం హాస్యాస్పదమన్నారు. యుసిసి బిజెపి ఎన్నికల రాజకీయ నినాదమని, ఆ నినాదంతో మతాల మధ్య విద్వేషాలు పెంచి ఓట్లను పోలరైజ్ చేసి తిరిగి అధికార పీఠం ఎక్కే ఎత్తుగడ అని పేర్కొన్నారు.

## విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర సహాయ కార్యదర్శి వేపాడ సత్యనారాయణ డిమాండ్ చేశారు. విద్యుత్తు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 26న విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఉద్యమ సన్నాహక రాష్ట్ర సదస్సు జరుగుతుందని తెలిపారు. ఆ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆయన మంగళవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆవిష్కరించారు.

## హాస్టల్ విద్యార్థుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్‌లోని సమస్యలను పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట మంగళ వారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యు.నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. మౌలిక వసతులు కల్పించకుండా కాలయాపన చేస్తోందన్నారు.

# నేడు జివిఎంసి స్థాయీ సంఘ ఎన్నికలు

**బరిలో వైసిపి, టిడిపి అభ్యర్థులు - ఎన్నికలకు దూరంగా సిపిఎం, సిపిఐ, జనసేన**

**స్టాండింగ్ కమిటీ అక్రమాల కోటరీగా మారినందునే ఈ నిర్ణయం : సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు**




ఎన్నికలకు సిద్ధమైన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని గది

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

జివిఎంసి స్థాయీ సంఘం ఎన్నికలు బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరగనున్నాయి. ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి నుంచి పలువురు కార్పొరేటర్లు బరిలో ఉన్నారు. అధికారంలో ఉన్న వారే స్థాయీ సంఘం సభ్యులుగా ఎన్నికవడం పరిపాటి. స్టాండింగ్ కమిటీ స్వప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ, నగర ప్రజల ప్రాధాన్యతలను పట్టించుకోకపోవడంతో మిగతా పక్షాలు ఎన్నికకు దూరం జరుగుతూ వస్తున్నాయి. సిపిఎం, సిపిఐ ఈ స్థాయీ సంఘ ఎన్నికలను బహిష్కరించాయి. జనసేన, బిజెపి కూడా ఇదే తోవలో నడుస్తున్నాయి. కార్పొరేషన్‌లో పార్టీల బలాబలాలు చూస్తే.. ప్రధానంగా అధికార వైసిపికి 63, టిడిపికి 27 మంది కార్పొరేటర్లు ఉన్నారు. జనసేనకు ముగ్గురు, బిజెపి, సిపిఎం, సిపిఐలకు ఒక్కొక్క కార్పొరేటర్ ఉన్నారు. జివిఎంసి అధికారులు స్థాయీ సంఘం ఎన్నికల్లో పోటీల్లో ఉన్న కార్పొరేటర్లకు లభించిన ఓట్లను బట్టి పది మంది సభ్యులతో కూడిన స్థాయీ సంఘాన్ని బుధవారం సాయంత్రానికి వెల్లడిస్తారు.

**10 మంది సభ్యుల ఎన్నిక ఇలా..**

ఒక స్టాండింగ్ కమిటీ కాలపరిమితి ఏడాది కాలం. ఇప్పటికి రెండు బ్యాచ్‌లుగా అధికార పార్టీ నాయకులే స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. అత్యధిక మంది కౌన్సిల్‌లో వైసిపి వాళ్లే అయినందున సహజంగా గెలుపు వారికే దక్కుతుంది. ప్రతి స్టాండింగ్ కమిటీ ఎన్నిక సందర్భంగా 10 మందిని ఎన్నుకోవాలి. వైసిపి కార్పొరేషన్ ఎన్నికల్లో గెలిచిన స్థానాలు 54 కాగా, తెలుగుదేశం 31 గెలుపొందింది. 2019 కొద్దిమంది వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఇంకొందరు తటస్థంగా ఉన్నారు. దీంతో టిడిపి సంఖ్యా బలం దాదాపు ఇప్పుడు 27-28 మధ్య ఉంది. వైసిపి కార్పొరేటర్ల బలం సుమారు 60 పైచిలుకు చేరింది. స్టాండింగ్ కమిటీ ఎన్నికల సందర్భంగా ఒక్కో కార్పొరేటర్ 10 ఓట్లు వేయాల్సి ఉంటుంది. 54 ఓట్లు ఎవరికి వస్తాయో వారిదే గెలుపు. ఈ లెక్కన వైసిపికే గెలుపు అవకాశం ఉంది.

**ప్రధాన పార్టీల నుంచి ఖరారైన అభ్యర్థుల జాబితా ఇదే..**

వైసిపి నుంచి భీమిలి అసెంబ్లీ సెగ్మెంట్ ఒకటో వార్డు నుంచి అక్కరమాని పద్మ, తూర్పు నుంచి 23వ వార్డు కార్పొరేటర్ గుడ్ల సత్యవిజయ, పశ్చిమం నుంచి 62వ వార్డు కార్పొరేటర్ బల్లా లక్ష్మణరావు, ఉత్తరం నుంచి 47వ వార్డు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి, 54వ వార్డు కార్పొరేటర్ చల్లా రజని, దక్షిణ నియోజకవర్గం 41వ వార్డు నుంచి కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, 29వ వార్డు నుంచి ఉరుకూటి నారాయణరావు, గాజువాక నుంచి 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, పెందుర్తి నియోజకవర్గంలోని 61వ వార్డు నుంచి కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, అనకాపల్లి నియోజకవర్గంలోని 81వ వార్డు నుంచి కార్పొరేటర్ పీలా లక్ష్మీ సౌజన్య బరిలో ఉన్నారు. తెలుగుదేశం పార్టీ స్టాండింగ్ కమిటీ అభ్యర్థులుగా 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, ఏడో వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, 19వ వార్డు కార్పొరేటర్ నొల్లి నూకరత్నం, 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, 38వ వార్డు కార్పొరేటర్ గోడి విజయలక్ష్మి, 56వ వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, 98వ వార్డు కార్పొరేటర్ పిసిని వరహానరసింహం, 10వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి బరిలో నిలిచారు.

**స్టాండింగ్ కమిటీ అధికార పార్టీ కోటరీగా తయారైంది**
**: సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు**

'స్టాండింగ్ కమిటీలో జరిగే నిర్ణయాలు లక్షల సంఖ్యలో ఉండే నగర ప్రజలకు ఊరటనిచ్చేవిగా ఉండాలి. కానీ ఎన్నికయ్యే వారంతా ఒక కోటరీగా స్టాండింగ్ కమిటీలో ఏర్పడి తమకు కావాల్సిన పనులను పెద్ద ఎత్తున అజెండాగా పెట్టించుకుని లాభం పొందుతూ అక్రమాలకు పాల్పడుతున్నారు. అందుకే సిపిఎంగా ఈ ఎన్నికల్లో పాల్గొనకూడదని నిర్ణయించుకున్నాం' అని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు చెప్పుకొచ్చారు.

# తానా ఫౌండేషన్ ట్రస్టీగా సతీష్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సేవా తత్పరుడు సతీష్ మేకా అమెరికాలోని ప్రతిష్టాత్మక 'తానా' ఫౌండేషన్ ట్రస్టీగా నియమితులయ్యారు. నాలుగేళ్ల పాటు ఆయన ఆ పదవిలో ఉంటారు. తనను ఈ పదవికి ఎంపిక చేసిన తానా బోర్డు అఫ్ డైరెక్టర్స్‌తో పాటు తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ సతీష్ ఈ సందర్భంగా మంగళవారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలియజేశారు. సతీష్ ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థుల మెరుగైన చదువు కోసం 25కు పైగా డిజిటల్ క్లాస్ రూంలు ఏర్పాటు చేయించిన విషయం తెలిసిందే. అంతేకాకుండా జర్నలిస్టులు సహా పలువురికి వైద్య సాయం అందించారు. తానా ఫౌండేషన్ ట్రస్టీ విద్యాధర్ గారపాటితో కలిసి అనేక సేవా కార్యక్రమాలలో కీలక పాత్ర పోషించారు. క్యాన్సర్ నివారణ, అవగాహనపై బసవతారకం క్యాన్సర్ హాస్పటల్, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్‌తో కలిసి వందకు పైగా వైద్యశిబిరాలు నిర్వహించారు. ప్రస్తుత బోర్డు అఫ్ డైరెక్టర్ జనార్దన్ నిమ్మలపూడి చేపట్టిన తానా బసవతారకం క్యాన్సర్ ప్రాజెక్ట్‌లో ముఖ్య భూమిక పోషించారు. కరోనా విపత్కర సమయంలో 5 వేల ఆక్సిజన్ కాన్‌సెంట్రేటర్లు అందజేయడంలో సతీష్ కీలక పాత్ర పోషించారు. ఈ నెలలో జరిగిన తానా మహాసభల్లో ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాల కమిటీ చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. ఇదిలా ఉండగా సతీష్ విద్యభ్యాసమంతా విశాఖలోనే సాగింది. రెండు దశాబ్దాల క్రితం అమెరికా వెళ్లి స్థిరపడ్డారు.

వాహనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

## వికలాంగులకు వాహనాలు పంపిణీ

ప్రజాశక్తి - రంపచోడవరం : రాష్ట్ర వికలాంగుల కార్పోరేషన్ ద్వారా మంజూరు వాహనాలను వికలాంగులకు మంగళవారం స్థానిక పిఎంఆర్‌సి వద్ద స్థానిక ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్, ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిసిసిబి చైర్మన్‌గా కోలా గురువులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ (డిసిసిబి) చైర్మన్‌గా కోలా గురువులు నియమితులయ్యారు. రాష్ట్రంలో కొత్తగా నాలుగు జిల్లాలకు డిసిసిబి చైర్మన్లను, పాలకవర్గాలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఆ నలుగురిలో కోలా గురువులు ఒకరు. దక్షిణ నియోజకవర్గానికి చెందిన కోలా గురువులు వైసిపి ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో ఉన్నారు. 2014 ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిగా దక్షిణ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. అయినప్పటికీ నిరాశ చెందకుండా పార్టీలో కొనసాగారు. రెండేళ్ల క్రితం రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. కొద్ది మాసాల క్రితం శాసనసభ్యుల ద్వారా శాసన మండలికి జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్సీగా వైసిపి తరుపున పోటీచేసిన ఆయన ఒక్క ఓటు తేడాతో ఓటమి చెందారు. ఈ పూర్వ రంగంలో గురువులను డిసిసిబి చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయం తెలియడంతో దక్షిణ నియోజకవర్గంలో వైసిపి కార్యకర్తలు హర్షం వెలిబుచ్చారు.

## 'మీతో ఆనంద్' యాప్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖపట్నం : సిఎం క్యాంప్ ఆఫీసులో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో విశాఖ పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త, ఎపిఎంఎస్ఎంఇ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రజల సౌకర్యార్థం, వారి సమస్యల పరిష్కారం కోసం మీతో ఆనంద్ యాప్‌ను సిఎం ఆవిష్కరించారు. ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఆడారి ఆనంద్ కుమార్ చేసిన ఈ చిరు ప్రయత్నాన్ని ముఖ్యమంత్రి ప్రశంసించారు. ఈ రోజుల్లో స్మార్ట్ ఫోన్ లేనివారు లేరని ... 'మీతో ఆనంద్' యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే ఆనంద్ మీతో ఉన్నట్లేనని చెప్పారు. ప్రజలు తమ సమస్యలను అప్లోడ్ చెయ్యడం నుంచి అవి పరిష్కారమయ్యే వరకు ట్రాక్ చెయ్యొచ్చని ఆనంద్ ఈ సందర్భంగా సిఎంకు తెలియజేశారు. నియోజకవర్గంతో తాను చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. అలాగే సిఎం దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లగా ఆయన జివిఎంసి 52, 57 , 62వ వార్డుల్లో మూడు ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్లను మంజూరు చేశారు. నియోజకవర్గంలోని మిగతా సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు.

## 21న 'ఒక్కడే వీరుడు అల్లూరి సీతారామరాజు' విడుదల

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాజా సాగి సత్యనారాయణరాజు నిర్మాతగా, విక్రాంత వర్మ సారథ్యంలో నిర్మించబడ్డ ఒక్కడే వీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రం ఈనెల 21న ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుందని అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు తెలిపారు. మంగళవారం డాబాగార్డెన్స్‌లోని విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ చిత్రానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో చిత్ర నిర్మాత రాజా సాగి సత్యనారాయణరాజు, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.